నూకరాజుకి వినిపించినట్లు కళ్లు తెరిచాడు. అంతవరకూ కన్నకల చెదిరినందుకు చింతిస్తున్నట్లు ముఖం ముడుచుకున్నాడు. అంతలోనే ఏదో ఆలోచన వచ్చినట్లు ఆనందంగా నవ్వాడు.

'మశూచొచ్చేముందు జ్వరమొస్తుందట్ట.... నాకొచ్చిన జ్వరం మశూచయ్యేలాచెయ్, నల్ల మారెమ్మ దేవతా నీకు నల్లకోడి కోస్తారు మా వాళ్ళు!' గొణుక్కుంటూ గాలిలోకి దండాలు పెట్టాడు.

ముసలి తల్లి కంగారు మరింతెక్కువయింది.

ఈ సారి అరుపులే మొదలు పెట్టాడు నూకరాజు, 'నాకు జొరంకాదు మశూచి ... మశూచంటే ఎయ్యి రూపాయిలు, నాకోసం ఏడవకండి. అమ్మా. అయ్యా.... అప్పలూ ... చెల్లెళ్ల .... తమ్ముళ్లు... లగెత్తుకెళ్ళి మునిసిపాలిటీ వాళ్ళకి నాకు మశూచని జెప్పి ఎయ్యి రూపాయిలూ తెచ్చుకోని సుకంగా ఉండండే. అమ్మా.... ఏనుగులాటి కొడుకెళ్ళిపోయాడనేడవకు. ఈ యేనుక్కి బతికుంటే ఏగానీ యిలువ లేదు. మశూచితో చస్తే ఎయ్యి రూపాయల యిలువ. ఎల్లండెల్లండి నాకు మశూచని జెప్పి ఎయ్యి రూపాయలు తెచ్చుకోండి.

పేదవాళ్ళకి పేదపెళ్ళాల్లా పేదవాళ్ళకి పేద డాక్టరయిన ఆచారి రానే వచ్చాడు.

"సంధి -" అన్నారెవరో.

ఆ మాట ఆచారి వినిపించుకోలేదు.

నూకరాజు చేతిని తనచేతిలోకి తీసుకుని నాడి చూడసాగాడు.


"మశూచి" అన్నాడు నూకరాజు.

" కాదు. వడదెబ్బ. " అన్నాడు ఆచారి కచ్చితంగా.

తుపాకి దెబ్బలా తగిలింది ఆ మాట నూకరాజుకి,

' మశూచి కాదూ? మా వాళ్ళకెయ్యి రూపాయిలు రావూ?'' అనేసి - ఏదారంగా బాధగా కళ్లు తేలవేశాడు.

''చచ్చిపోయాడు.'' అని అధికారికంగా చెప్పేసి తనవిధి నిర్వర్తించేసుకున్నాడు డాక్టరు. ❋





# ఏ దేశచరిత్ర చూసినా...

## — సాహితి

పేరెందుకుగాని, అదో చరిత్ర ప్రసిద్ధి గాంచిన వూరు. శిల్పసంపద రాశిపోసి వుంది, విదేశీయులు సైతం మురిసిపోయి, మెచ్చుకుంటూ వుంటారు. "అసలు వారు మెచ్చుకుంటేనే కదండీ మనవారి గొప్ప మనకి తెలిసేది." ఈ మాట కేశవరావు కాస్తకోపంగా అంటూ వుంటాడు. అతగాడు చరిత్ర విద్యార్థి. మన రాజులు, రాణులు,-కవిగారన్నట్టు వారి ప్రేమపురాణాలు—వగైరా విషయాలు చదువుతుంటే మంచి థ్రిల్లింగ్‌గా వుంటుందతనికి. ఆ కాలంలో పుట్టకపోతినే అని విచారంగానూ వుంటుంది. అతని స్నేహితుడు రాఘవరావు కిది నచ్చదు. గతాన్ని అవగతం చేసుకొని అంతటితోవదలడమేగాని అనుసరించడం హాస్యాస్పదమని అతని అభిప్రాయం. ఆఖరి పరీక్షరాసి చేతులు దులుపుకొంటుంటే, వారి విదేశీమిత్రుడు రాబర్ట్ వచ్చాడు. "శలవుల్లో ఎక్కడికి కెళ్తున్నారంటూ?" "ఇంకా ఏం తేల్చుకోలేదన్నాడు" కేశవరావు. చరిత్రలో గొప్ప పేరొందిన ఆ వూరు పేరుచెప్పి వెళ్ళి చూసి రండని సలహా యిచ్చాడు." ఏం శిల్పమయ్యా బాబూ! అఖండులు కదా మీ భారతీయులు, అక్కడ ఓ మండపంలో ఒక నాట్యకత్తె శిల్పం వుంది, అబ్బ! ఏం సౌందర్యం! బ్రహ్మాండంగా చెక్కాడనుకో, మరి వదిలి రాబుద్ధే కాదు లేదు. అహ! . నిజంగా ఎవరూ లేకుండా చూసి, ముద్దు పెట్టేసుకొన్నాననుకో! చూసి తీరవలసిన శిల్పం" రాబర్ట్ అరమోడ్పు కన్నులతో ఆ అనుభూతి యొక్క పారవశ్యాన్ని మిత్రులిద్దరి ముందూ ప్రదర్శించేడు. కేశవరావు వళ్ళు ఝల్లుమంది, రోగిముందు పిండి వంటల గురించి వర్ణిస్తున్నట్టే వుంది. రాఘవరావులోనూ కుతూహలం రేకెత్తింది. "ఇన్నాళ్ళూ చూడకపోవడం పెద్దతప్పు. పదరా" అన్నాడు కేశవరావు. "యూనివర్శిటీ మూత పడనీ" అన్నాడు రాఘవ. పరీక్షలైన మరునాడు పెట్టెలు లేవుగాని బెడ్డింగ్‌లు మాత్రం సర్ది రైలెక్కేరు.




ఆ వూరులో కాలు పెట్టిన దగ్గర్నుంచీ అడుగడుగునా మూర్ఛపోయినంత పని చేస్తున్నాడు కేశవరావు. "శిలలపై శిల్పాలు చెక్కినారూ ...." అంటూ ఆగకుండా కూనిరాగాలు తీస్తూనే వున్నాడు. గుళ్ళు, గోపురాలు అంతఃపురాలు అన్నీ వరసగా చూసుకుంటూ వస్తున్నారు. గైడు వెంటపడ్డాడు, "వెళ్ళవయ్యా, నీ వ్యాఖ్యానం ఏమీ అవసరం లేదు" కసురుకున్నాడు రాఘవరావు. "వుండనీరా! మనకి తెలియని వెన్ని వున్నాయో ! చెప్పనీ." కేశవరావు కుతూహలం పెరిగిపోతోంది. "ఆహా! మన ఘటా వాళ్ళు మాంత్రికులా? రాతిలో ఎన్ని భావాలు, ఎన్ని అలంకరణలు, ఎన్ని చిత్రాలు .... వాళ్ళ చేతుల్లో ఏముందో ? చూడు చూడు రాఘవా, ఆ రథంమీద రాణి...అదిగో అటుచూడు చల్లి ముంతలు పట్టుకుని వయ్యారి గొల్లభామలు...అబ్బ ఈ కృష్ణుడు చూడు ఎంత ముద్దుగా వున్నాడో..." కేశవరావు ఆవేశంగా చెప్పుకుపోతున్నాడు,







"ఓ పక్క ఈ గైడుగాడు, ఈ పక్క నువ్వూ నన్నిలా వూదరగొట్టేస్తుంటే నాకు మహా బోర్‌గా వుందిరా బాబూ, కాస్సేపు నోరు మూసుకుండికి ఏమివ్వమంటారు మీరిద్దరూ ?" "ఛ, పోరా! ఇంత ఉత్కృష్టమైన కళని చూసి ఆనందించలేక పోతున్నావు. నువ్వూ ఓ భారతీయుడవేనా! నువ్వూ ఓ తెలుగువాడివేనా?" దీనికి రాఘవరావు సమాధానం చెప్పలేదు సరికదా పూర్వవైభవం తలుచుకుని మురిసిపోతున్న కేశవరావుని చూసి కొంటెగా నవ్వాడు. నవ్వి, చిన్నగా పాడాడు, "ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం" అని కాసేపు ఆగి, కళ్ళెగరేసి, మళ్ళీ పాడాడు. "తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు ?"

"రాఘవా" కేశవరావు పెట్టిన కేకకి చుట్టుప్రక్కలవాళ్ళు అదిరి పడ్డారు.

"కోపం వద్దురా బాయ్! మరీ అంత

పరవశం పనికిరాదని చెప్తున్నానంతే" కేశవరావు భుజంమీద మెల్లిగా తడుతూ, నెమ్మదిగా నవ్వాడు రాఘవ.

"నీ మొహంలే! ఆ రాజులు, రాణులు వారి వైభవం, కళాతృష్ణ, వారి ఔదార్యం, త్యాగం ఏ దేశచరిత్ర కుందిరా ఇంతటి ఔన్నత్యం? కూరగాయ లమ్మినట్లు రత్నాలు రాశిపోసి అమ్ముతుండేవారట. ఆ రాబర్ట్‌గా డిది విని కళ్ళు తేలే శాడు, చూశ్నేదూ....?"

"కాని మనమెందుకు కళ్ళు తేలేయడం యిప్పుడు?"

"రాఘవా! నిజంగానే నాకిప్పుడు కళ్ళు తేలిపోతున్నాయ్! అదిగో....ఎదురుగా హోటలు కనపడుతోంది. పద."

"ఆ మాటన్నావు బాగుంది."


"భోజనంకూడా పూర్వవైభవాన్ని దాటుతోందిరా ఇవాళ, దశాబ్దాలక్రిందటి దొండకాయకూర, శతాబ్దాల క్రిందటి సాంబారూ....అబ్బో బహుశా యివన్నీ అప్పటి రాజులు వండించిన వనుకుంటాను. మనలాంటి యాత్రికులని తరింప చేయడానికని ఇవి వడ్డించి వుంటారు," భోజనం చేస్తున్నంత సేపూ రాఘవరావు ఇలా వెక్కిరిస్తూనే వున్నాడు.

○ ○ ○

"ఈ మంటపంలో కాసేపు రెస్ట్ తీసుకుందాం?" అన్నాడు కేశవరావు చుట్టూ కలయచూస్తూ. జేబురుమాలుతీసి, క్రింద దులిపి, కూర్చున్నాడు. "సరే! అయితే! ఏవయ్యా గైడూ....రెండుగంటల దాకా నీ నోటికి రెస్ట్! ఇకపో!", అన్నాడు రాఘవరావు మండపంలోని ఓ స్తంభానికి జేరబడి కూర్చుంటూ.

"అలాగేనండి! ఈ మంటపంలో శిల్పాలు చూశారా! దేశ, విదేశాలలో ఎంతో పేరుగాంచినవీ శిల్పాలు, ముఖ్యంగా ఇదిగోనండి ... ఈ నాట్యకత్తె శిల్పం దీనికో కథ చెప్తారండీ..." అంటూ గైడు వివరించడానికి పూనుకున్నాడు, కూర్చున్నవాడల్లా కేశవరావు దిగ్గునలేచి, గైడు చూపిన శిల్పానికి ఎదురుగా వెళ్ళి చూస్తూ అట్టే నిలబడ్డాడు. రాబర్ట్ చెప్పిన నాట్యకత్తె ఇదే! ఎంత సౌందర్యం? కన్నుల్లో ఆ శృంగారభావం ఎలావచ్చిందో! ఆ పెదవులంత సుకుమారంగా ఎలా చెక్కగలిగారో? కొద్దిగా వంగి నడుమునున్న చేతిని మరో చేతితో పట్టుకుని, ప్రక్కకి చూస్తూ, చిరునవ్వు నవ్వుతోంది. చటుక్కున చూపరుల నాకట్టుకుని మనసుదోచే అపూర్వమైన నాట్యభంగిమ. అపురూప సుందరి! ఎవరిని దృష్టిలో పెట్టుకుని చెక్కాడో శిల్పి. కేశవరావు తన్మయత్వం నుంచి తేరుకుని చూసే సరికి గైడు లేడక్కడ, రాఘవరావు తల కింద రెండు చేతులు పెట్టుకుని వెల్లకిలా పడుకుని నిద్ర కుపక్రమిం






చాడు. ఇంకా కొందరు యాత్రికులు ఆ మండపంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. కేశవరావుకూడా నెమ్మదిగా నడుం వాల్చాడు. తలని ఆ శిల్పం కాళ్ళ దగ్గర పెట్టుకున్నాడు. కళ్ళెత్తిచూశాడు. ఉన్నతమైన వక్షోజాలు, కొనదేరిన గడ్డం. రెప్ప వాల్చకుండా చూశాడు. చేతితో తాకాడు. ముట్టుకుంటే కంది పోతాయేమో! నవ్వుకున్నాడు, పక్కలకి ఒత్తిగిలి కొద్దిగా ఎత్తివున్న ఆ నాట్యకత్తె పాదానికివున్న మువ్వల పట్టెడలోని మువ్వలను లెక్కపెడుతున్నాడు. మండపం ప్రక్కనున్న కోనేటిమీదుగా చల్లని గాలి వీచింది. కళ్ళు మూతలు పడుతున్నాయి.

● ○ ○

కాలి మువ్వలు ఘల్లు మన్నాయి. జరీ అంచు కుచ్చెళ్ళు పాదాల మీదుగా జీరాడాయి. సన్నని నడుమునుచుట్టి ముత్యాల మొలనూలు గర్వంగా వూగుతోంది. రత్నాల కంకణాలు ఎర్రగా చూస్తున్నాయి. పాలలాంటి శరీరపు రంగు వాటి ఎర్రదనాన్ని మరింత ప్రకాశింప చేస్తోంది. పట్టెడు వెడల్పన పాములాంటి జడ వెనక భాగాన నిర్ర పీగుతోంది.

ఘల్ ఘల్.. సుందరి కదిలింది, మైమరచిపోయిచూస్తున్నాడు కేశవరావు. ఎవరీమె? ఎవరో మహారాణి కాబోలు! ఆమె వంటిమీద ఎన్ని రత్నాలు? ఎన్ని! ముత్యాలు? ఎన్ని రవ్వలు? అబ్బ ఆమె నడకే .. నాట్యం లాగుందే?


ఎక్కడి కలా? కేశవరావు ... తనూ వెళ్ళుతున్నాడు. పెద్దపెద్ద ప్రాకారాలతో, ఆకాశాన్నంటే ఎత్తయిన దర్వాజాలతో ఎంత పెద్ద భవనాలో! అన్నీ రాతి కట్టడాలే! అదేమిటో. వాళ్ళ దుస్తులంత విచిత్రంగా వున్నాయేమిటి? ఆ తలపాగాలు, పంచెకట్టు అంతా తమాషాగా వుందే! విశాలంగా కళకళలాడుతూ వుంది రాజవీధి కాబోలు. కేశవరావు వింతగా కలియచూస్తూ ఆ సుందరివెనకే వెళుతున్నాడు. అంతలోనే వీధిలో ఓ పక్క కలకలం వినిపించింది. ఏమిటా అని అటు వెళ్ళాడు ఓ మనిషిని రెక్కలు విరిచి పట్టుకుని, దుర్భాషలాడుతున్నారు చుట్టూ జనం. "ఏమిటి జరిగింది?" గుంపులో జొరబడ్డాడు కేశవరావు. అదో కోమటి కొట్టు, మంచి రద్దీగా వున్న సమయం చూసుకుని ఓ పెద్ద బెల్లపు అచ్చు దొంగిలించబోయాడట. పట్టుకున్నారు." "పదండి రాజుగారిదగ్గరికి" అరుస్తూ తిడుతూ తీసుకుపోతున్నారు. కలుక్కుమంది కేశవరావుకి. ఇక్కడకూడా దొంగ తనమా? వీళ్ళకూడా ఇలా తిట్టుకుంటారా? ఇంత ఐశ్వర్యం అడుగడుగునా కన్పిస్తోందే! దొంగ తనాలుకూడా జరుగుతున్నాయా? ఆలోచిస్తూ వాళ్ళతోపాటే తనూ వెళ్ళాడు.

అదిగో రాజ దర్బారు. ఆ ఎత్తుగా వున్న ఆ సింహాసనంమీద అదిగో.. రాజు ఆయనేనా?

కేశవరావుకి విపరీతమైన నిరాశ ముంచుకొచ్చింది. కావ్యాల్లో యింద్రుడు చంద్రుడని పొగిడారు! అపరమన్మధుడని, కామినీ మానస చోరుడని, అదని ఇదని.. అయ్యో! కనీసం. ఎప్పుడూ రాజుల వేషాలువేసే సినిమా యాక్టరు రవిబాబులా కూడా లేడే, సామాన్యమైన ముఖకవళికలు! కేశవరావిలా నిరుత్సాహంగా, నిరసాంబుధిలో మునిగి వుండగానే, ఆక్రందన వినిపించింది చటుక్కున అలాచూసే సరికి రక్తసిక్తమైన మొండి చేతులతో, దీనాతిదీనంగాఏడుస్తూ కనిపించాడు ఇందాకటి ఆ నేరస్తుడు. వికారమొచ్చినంత పనైంది కేశవరావుకి, ఆ దృశ్యంచూడలేక కళ్ళుగట్టిగామూసుకున్నాడు. "ఘోరం! చిన్న దొంగతనం చేయబోయినందుకింత శిక్షా!" వికలమైన మనసుతో వెనుదిరిగాడు. మరో మనిషి దీనంగా ఏడుస్తూ, తలొంచుకుని రక్షకభటుల మధ్యనుంచి నడుస్తూవెళ్తున్నాడు. "ఇతనేం నేరంచేశాడు" స్వగతంగా అనుకున్నాడు. "బాబూ ..... ఈ ఏడు పంటలు పంతలేదు ప్రభూ! ఐదువవంతు పన్ను కట్టేస్తే నేనూ....నా కుటుంబమూ ... యీ ఏడాది కట కటలాడవలసి వస్తుంది ప్రభూ! నామనవి.. "ఆ మనిషి ఏడుస్తూ ఏదో మొరపెట్టుకుంటున్నాడు








దర్బారులో.

"మైగాడ్! అంతలేసి పన్నులా?" గుండెలమీద చేయి వేసుకున్నాడు కేశవరావు.

అంతలో సుందరి గుర్తు వచ్చింది. అరెరే! అనుకుంటూ దర్బారు వదిలి, రాజవీధికిపరుగుతీశాడు. అదిగో అల్లంత దూరాన కనిపించింది సుందరి, పరుగు తీశాడు.

○ ○ ○

ఆమె అలంకరించుకొంటోంది అద్దం ముందు కూర్చుని, సాయంత్రం ఆరు గంటలవుతోంది. వాతావరణం ఆహ్లాదంగా వుంది. కేశవరావు ఆమెవెనకే ఆమె ఇంట్లోకి ప్రవేశించాడు. అప్పటికామె గ్రహించింది తన వెనకే అతను వస్తున్నాడని, "ఎవర్నువ్వు?" అనడిగింది వింతగాచూస్తూ.

"నా పేరు కేశవరావు!" అన్నాడు ఆమె గొంతులోని మాధుర్యానికి పరవశిస్తూ.

"ఓ! అవును, నా కాళ్ళదగ్గిర తలపెట్టుకు నిద్రపోయావు! నువ్వే నా!" అంది రెప్పలు అల్లల్లాడిస్తూ.

ముగ్ధుడై పోయాడు కేశవరావు. "ఔను, నేనే! అబ్బ! ఎంత అందంనీది! నీతోపాటేనడిచి వచ్చేశాను." అన్నాడు.

"ఔను! వెనక్కినడిచావు. ఏం ప్రయోజనం?" నవ్వింది ప్రశ్నవేస్తూ.

"మా పూర్వుల వైభోగం కళ్లారా చూద్దామని!"

కిలకిల నవ్వింది.

"నువ్వెవరు ? మహారాణివా!"

పెదవి విరిచింది.

"రాజ నర్తకివా?"

తల అడ్డంగా తిప్పింది.

"మరి..."

"సామాన్య నర్తకిని."

'ఆ!'

"ఔను!" ఆమె అద్దంలోకిచూస్తూ తిలకం దిద్దుకుంటూ అంది. "కాని నా కెన్ని ఆశలు! ఎన్ని ఆదర్శాలు! అవగ కాడు ఎంత మురిసి, తనిసేడు! చేయి పట్టి వదలనన్నాడు. ఎంత తీవి అనుకున్నావు? తప్పకుండా రాజవంశీయుడే అయివుంటాడు." ఆమె కలలోలామాట్లాడుతోంది.

"ఎవరతను నీ ప్రియుడా!"

"ఊఁ .... ఈవేళ చెప్తానన్నాడు తానెవరో! కలువల కొలను దగ్గర రెండోఝాముమువేళ....నువ్వూచూస్తావా" అతనికేసి తిరిగి ఉత్సాహంగా అడిగింది.

"ఓ తప్పకుండా."

ం ం ం

వెన్నెలవెల్లువ జగత్తునంతాముంచెత్తుతోంది. దట్టంగా చెట్లతో, లతలతో,గుబురులతో నిండిన పెద్ద ఉద్యానవనమది. ఓ ప్రక్కన కోనేటి నీళ్ళలో చందమామ నవ్వుతూ తేలుతున్నాడు. అక్కడే ఓ చెట్టుకి గుర్రం కట్టివుంది. చెట్టుచాటున నిలబడి కేశవరావు కుతూహలంగా చూస్తున్నాడు.

కోనేటి నీళ్ళలో కాళ్ళు పెట్టుకుని ప్రియునికోసం నిరీక్షిస్తూవుంది నాట్య సుందరి, వెనగ్గావచ్చి నిలబడ్డాడోక పురుషుడు.

"ఎక్కడో చూసినట్టుందే ఇతన్ని!" అనుకున్నాడు కేశవరావు.

ఆ తరువాత వారిద్దరూ సంతోషంగా, మాట్లాడుకుంటూ పొదరింటివైపు నడిచారు.

తియ్యని వూహలలో తేలిపోతూ చెట్టుక్రిందే కూర్చుండి పోయాడు కేశవరావు.

కొంతసేపటికి అలికిడయింది మాటలు వినవస్తున్నాయి.

"స్వామీ" మత్తుగా ఆమె కంఠం వినిపించింది.

"ఇప్పుడైనాచెప్పరాదా తామెవరో!"


అతను నవ్వి ఆగాడు.

"చెప్పండి."

అతని స్వరం గంభీరంగా, అతి నెమ్మదిగా వినవచ్చింది. "ఈదేశాన్నేలే రాజుని, ఆదిత్యవర్మని. చూడలేకను కుంటాను నన్నింతకుమునుపు."

చటుక్కున లేచి నిలబడి, తొంగి చూశాడు కేశవరావు. నిర్ఘాంతపోతూ, నిలువునా వణుకుతూ నిల్చుంది. ఆనాట్య సుందరి. "ఆ! అవును, ఇతను రాజే! పొద్దున్న దర్బారులో చూశానుగా!"అను






కున్నాడు కేశవరావు.

"ప్రభూ...ఐతే....మన ప్రణయం ...." ఆమె ఎంతో ఆందోళనగా భయంగా అడిగింది.

"చెప్పావుగా, నీ కలలన్నీను. నా సహచరిని చేసుకుంటాను నిన్ను!"

"నిజమా ప్రభూ!" ఆనందంతో పొంగిపోయింది. "అబ్బ! ఆ రాజెంత విశాలహృదయుడు." కేశవరావు మనసారా అభినందించాడు.

ం ం ం

"ఓరేయ్! కేశవా! కేశవా!" రాఘవరావు వంగి కేశవరావువీపుమీదతడుతూ లేపుతున్నాడు. మత్తుగా కళ్ళుతెరిచాడు కేశవరావు. రాఘవరావు మొహం అస్పష్టంగా కన్పించింది. కళ్ళుపూర్తిగా తెరవాలని లేదు.

'అబ్బ! వుండరా! ఇంకా స్వప్నం...' మాట పూర్తి చేయకుండానే నిద్రలోకి జారాడు మళ్ళీ అటు ఒత్తిగిల్లి పడుకుంటూ.

"హూ! కానీ." అంటూ, కూడా తెచ్చుకున్న ఇంగ్లీషునవలొకటిచదవడం ప్రారంభించాడు రాఘవరావు.

ం ం ం

"ఎక్కడా ఆ నాట్య సుందరి.... ఎక్కడ..." తెగ వెతుక్కుంటున్నాడు కేశవరావు. వీధులన్నీ తిరుగుతున్నాడు. ఏదో మార్పు కనిపిస్తోంది. అదేమిటో అర్థంకాలేదు. అంతఃపురభవనాలవేపుగా వెళ్ళాడు. ఏవో అపరిచిత ముఖాలు. దాటి మరో వీధిలోకివెళ్ళాడు. అక్కడ ఇంచుమించు అన్నీ ఒకేలా కట్టిన భవనాలున్నాయి. అయితే అవి అంతఃపుర

భవనాలకంటె చిన్నవి. 'భలే! ఆ కాలంలోకూడా క్వార్టర్సు కట్టేవారన్నమాట" అనుకున్నాడు. అలా చూసుకుంటూ నడుస్తుంటే, ఒకస్త్రీ వాకిట్లోనిలుచుండి, తనని చేయెత్తి పిలవడంచూశాడు. ఆమె వయసు యేభై దాటివుంటుంది. కాని అందంగావుంది. యౌవనపుబిగువు సడలించడం కాలానికికొంతవరకు మాత్రమే సాధ్యం అనిపిస్తుందామెనుచూస్తే.

సందేహంగాచూస్తూ ఆమెను సమీపించాడు.

"ఎవ...ఓ...చూశాను. ఎక్కడా ...అ(... మీరు ... మీరు ...అతనింకా సందిగ్ధంగా, ఆశ్చర్యంగా ఏదో అనబోతుండగానే ఆమె ఫక్కున నవ్వింది.

"అదేనయ్యా! ఆ నాట్యసుందరిని."

"ఆ!"

ఊ!"

"మరి...మరి....ఇంతకాలం....ఊ ...సరే! మరి నీ ప్రియుడు...అదే ఆ మహారాజు...ఎక్కడ?" ఆమె దీర్ఘంగా నిట్టూర్చింది. కళ్ళలో నీటిపొరకమ్మింది. "ఆ మహారాజు కోసమే ఈ నిరీక్షణ. అంతులేని నిరీక్షణ."

'అంటే!'

"అంటేఏముంది? ఆనాడు మమ్మల్ని చూశావుగా! అయనగారు వాగ్దానం తప్పకుండా, ఈ భవనానికి నన్ను చేర్చారు.'

'నిన్ను వివాహమాడలేదా?'

'పిచ్చివాడా! అయనకు రాణులు నలుగురున్నారు. ఇక మేవందరం అంటే... అదిగోచూడు...ఈ వరసన భవనాలన్నీ నాలాంటివారికోసం!"

"అంటే....ఉంపుడు" పూర్తిచేయలేక ఆగాడు కేశవరావు.

"ఔను, అయనగారి దర్శనం యీ ముప్పైఏళ్ళలోనూ నాకు మూడుసార్లు మాత్రమేకలిగింది. ఇప్పుడాయన అస్వస్థుడుగా వున్నాడు. ఆయన కొడుకు రాజ్యానికి వచ్చాడు. చివరిసారి ఆయనగారిని నేను చూసింది పదేళ్ళక్రితం."

"అయితే మరియింతకాలమూ మీరేం చేస్తారు?"

"ఏంచేస్తాం! దురదృష్టవశాత్తూ-ఎవరేనా వలచిననాడు తటస్థపడితే చెయ్యందివ్వలేం. ఈ యౌవనభారాన్ని ఒంటరిగామోస్తాం. అడవినికాచిన వెన్నెలమా సౌందర్యం. ఏనాటికి మహారాజుకి మామీద కరుణ కలుగుతుందోనని కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తాం. ఈ నిరీక్షణ సంవత్సరాల తరబడి సాగుతుంది. మాజీవితాలకి రాజావారిఉంపుడుగత్తెలమన్న బిరుదే సర్వస్వమూను.

"ఎంతదారుణం? భగవంతుడా ఒక్క వ్యక్తికోసం ఇంత సౌందర్యం ఇంతటి యౌవనం ఇన్ని జీవితాలూ అన్నీ అన్నీ ...వ్యర్థమా?''

ఆమె తనలోతనే చెప్పుకుంటున్నట్లుగా అంది. "ఆ శిల్పి...సుందరుడు. నన్ను వలచాడు. మహారాజు మీద పేరాశలు పెంచుకున్న నామనసూ విరిగింది, శిల్పిమీద మమత చిగురించింది. ఫలితం శిల్పికి శిరచ్ఛేదం."

"ఆపండి." కేశవరావు మరి వినలేకపోయాడు. హృదయం ఆక్రోశిస్తోంది. చరచరా వెనుదిరిగి నడవడం మొదలెట్టాడు. ఎంతదూరం నడిచాడో తెలియదు. వూరు దాటినట్టుంది. అక్కడ భయంకరంగా చప్పుళ్ళు వినిపించాయి. ఓ కొండగుట్ట ఎక్కిచూశాడు. అక్కడ బీభత్సంగా యుద్ధం సాగుతోంది. తలలు తెగుతున్నాయి. మనుషులు క్రూరంగా రాక్షసంగా కన్పిస్తున్నారు. హాహాకారాలు, ఆక్రందనలు, అబ్బ! మనిషిని మనిషి ఎలా నరుక్కుంటున్నాడో! రక్తం కాలువలు కడుతోంది. కళ్ళు తిరిగిపోతున్నాయి కేశవరావుకి. బాబోయ్ ఎంత రక్తం? ఎందుకీయుద్ధం? ఏ దేశ చరిత్రచూసినా....చూసినా...కేశవరావు మరి నిలబడలేక దభాలున కూలిక్రింద పడ్డాడు.

o o o

'ఒరేయ్! ఏమిట్రా ఆ అరుపులు? ఆ పాటేమిట్రా మధ్యలో! ఈరాతికట్టడాల్లోంచివచ్చిఏదయ్యమైనా నిన్నావేశించిందేమిటి?"

కేశవరావుకళ్ళుతెరిచాడు. ఒక్కసారిగా లేచికూర్చుని చుట్టూచూశాడు. ఎదురుగా రాఘవరావు నవ్వుతూ ఏమిటో అంటున్నాడు. మామూలు స్థితికొస్తూ, కళ్ళునులుముకుంటూ అడిగాడు.

"ఏమిట్రా రాఘవా?"

"అదే! ఆ పాటలేమిటి, కేకలేమిటి అనడుగుతున్నాను!"

"పాటలా?' ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును!' ఏ దేశచరిత్రచూసినా ఏమున్నది గర్వకారణం, ఏమున్నది గర్వకారణం?" అంటూ తెగ అరుస్తున్నావు. కలా! ఏం కలగన్నావురోయ్! పగటికల! చెప్పునాకూడా!"

"ఆ!.. కలా ..అవును కలే!" అని మెల్లగా జుట్టుసర్దుకుని, షర్టు దులుపుకుని లేచినిలబడి మళ్ళీ అన్నాడు గట్టిగా, "ఏ దేశ చరిత్రచూసినా ఏమున్నది గర్వకారణం?"

❋

